
ప్రజాశక్తి
సోమవారం 4 ఆగస్టు 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





'కాకాణి'ని విచారించిన సిట్

నేడు కొనసాగింపు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సిట్ అధికారులు ఆదివారం విచారించారు. కోర్టు ఆదేశాలతో ఆది, సోమవారాల్లో రెండు రోజులు పాటు ఆయన్ను విచారించడానికి సిద్ధమయ్యారు. ఆదివారం ఉదయం నెల్లూరులోని జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సిట్ అధికారులు తీసుకెళ్లారు. కొత్తూరులో జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో ఆయనను విజయవాడ నుంచి వచ్చిన సిట్ అధికారులు విచారించినట్లు తెలిసింది. కాకాణి మంత్రిగా ఉన్న సమయంలో సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం జాతీయ రహదారి వద్ద ఉన్న 60 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నం చేశారని, ఆయనపై కేసు నమోదైయింది. ఈ కేసులో విచారణ చేపట్టారు. విచారణ అనంతరం సిట్ అధికారులు ఆయనను జైలుకు తీసుకెళ్లారు. సోమవారం ఉదయం మళ్లీ ఆయనను విచారించనున్నారు.


కాకాణి గోవర్ధన్‌రెడ్డి

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజలపై భారాలు మోపే విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించే చర్యలు తక్షణమే ఆపాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నగరంలోని కోటమిట్ట ప్రాంతంలోని చేపల మార్కెట్ సెంటర్ నుంచి షాది మంజిల్ మీదుగా విద్యుత్ సబ్ స్టేషన్ వరకు ఆదివారం నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సి.ఎస్. సాగర్, సిపిఐ నగర సహాయ కార్యదర్శి సిరాజ్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు యానాదయ్య, ఎస్.యు.సి.ఐ పార్టీ నాయకులు బసవరాజు ప్రసంగించారు. రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ ప్రభుత్వ ఆధీనంలోనే ఉందని దానిని అదాని లాంటి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు రంగంలోకి తీసు కొస్తుందన్నారు. విద్యుత్ పంపిణీ పేరుతో ప్రజలపై అధిక భారాలు మోపుతూ కార్పొరేట్ కంపెనీలు మరింత దోచిపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పగలుపూట విద్యుత్తు వినియోగానికి (ఒక యూనిట్‌కు) ఒక రకమైన రేటు రాత్రి సమయంలో విద్యుత్తు వినియోగానికి (ఒక యూనిట్ కు) ఒకరకమైన రేటును విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఈ ధరను స్మార్ట్ మీటర్ల ద్వారా నిర్ణయిస్తారని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందన్నారు. సెల్ ఫోన్ రీఛార్జ్ మాదిరిగా రీఛార్జి చేయించుకునే పరిస్థితి కల్పిస్తారని అన్నారు. ప్రజల నెత్తిన గుది బండగ మారే స్మార్ట్ మీటర్లు తక్షణమే బిగించే చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. వివిధ రకాల పేర్లతో అదనపు భారాలు కరెంట్ బిల్లుల్లో మోపుతున్నారని వాటిని రద్దుచేసి కరెంటు చార్జీలు తగ్గించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రజలు ఐక్యంగా స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని అప్రమత్తంగా ఉండాలని కోరారు. వామపక్ష పార్టీల నాయకులు షేక్ ఫయాజ్,హుమాయున్, ఇస్మాయిల్,అజీజ్, షాన్ వాజ్,అశోక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

కరేడులో పోలీస్ 30 యాక్టు ఎత్తివేయాలి

ప్రజాశక్తి -ఉలవపాడు :కరేడులో పోలీస్ 30వ యాక్టును వెంటనే ఎత్తివేయాలని రైతు ఉద్యమ నాయకుడు ,139 బిసి కులాల జెఏసి రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉన్న తమ గ్రామంలో 30 యాక్టులు పెట్టి రైతు ఉద్యమాన్ని అణిచివేయాలని చూడటం తగదన్నారు. రైతులకు మద్దతుగా వస్తాము అంటున్న నాయకులను తమ గ్రామంలోకి రానివ్వకుండా అడ్డుకోవడం ఏమిటి అని ప్రశ్నించారు. ప్రభుత్వం రైతుల భూములను బలవంతంగా లాక్కోవాలని చూస్తుంటే భూములను కాపాడే విధంగా వివిధ సంఘాల నాయకులు తమ గ్రామానికి వస్తుంటే శాంతి భద్రత సమస్య ఉందంటూ పోలీసులు సభలు సమావేశాలు ఏర్పాటు చేసుకోకుండా అడ్డుకోవడం తగదన్నారు. వెంటనే పోలీసు వారు 30యాక్ట్ వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే త్వరలో చలో అమరావతి కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.


ఫైనాన్స్ సంస్థ వేధింపులు తాళలేక


వ్యక్తి బలవన్మరణం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

ఆర్థిక ఇబ్బందుల వల్ల తన సొంత ఇంటిని తనకా బెట్టి రుణం తీసుకున్న వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన నెల్లూరు జిలా బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని కట్టుబడిపాలెం దళిత వాడలో ఆదివారం చోటుచేసుకుంది. మతుడు చిన్న మస్తానయ్య భార్య కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

చిన్న మస్తానయ్య(72) పిల్లల విద్య కోసం ఆల్టమ్ క్రెడో హోమ్ ఫైనాన్స్ సంస్థ నుంచి నుంచి తన ఇంటిని తనకా పెట్టి రూ.7 లక్షలు రుణం తీసుకున్నాడు. అయితే అప్పటినుంచి ఇప్పటివరకు దాదాపు రెండేళ్లపాటు పాటు నెలకు రూ. 14,000 చొప్పున ఆ సదరు ఫైనాన్స్ సంస్థకు చెల్లిస్తున్నాడు. గత రెండు నెలలుగా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో జూన్, జూలై మాసాలలో వాయిదా చెల్లిం చలేకపోయాడు. దీంతో ఆ ఫైనాన్స్ సంస్థ సిబ్బంది మస్తానయ్య ఇంటికి వచ్చి మానసికంగా వేధించారు. ఇల్లు తనకాలో ఉందని రూ. 8 లక్షలకు అమ్మబడుతుందని ఇంటి గోడలకు సిరా గుర్తులతో రాసి వెళ్లారు. దీన్ని అవమానంగా భావించిన చిన్న మస్తానయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంటి ఆవరణంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకొని మతి చెందినట్లు భార్య తెలిపింది. కేవలం ఫైనాన్స్ సంస్థకు రుణం చెల్లించని కారణంగానే మనస్థాపానికి గురై మతి చెందినట్లు మతుడు సూసైడ్ నోటు రాసిపెట్టి మతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.చిన్న మస్తానయ్య మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.


చిన్న మస్తానయ్య (ఫైల్)




ఇల్లు తనఖాలో ఉందని ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులు గోడపై రాసిన దృశ్యం

పెరిగిన టమోట ధరలు

వినియోగదారులు బెంబేలు

ప్రజాశక్తి-కందుకూరు : టమోటా ధర ప్రజలకు దడ పుట్టిస్తుంది. గత నెల రోజులుగా టమోటాల ధర రోజు రోజుకి పెరుగుతుంది. ప్రస్తుతం కందుకూరు మార్కెట్లో కిలో టమాటాల ధర 50 నుంచి 55 రూపాయలు పలుకుతున్నాయి. నెలరోజుల క్రితం టమోటాల ధర కిలో 16 రూపాయలు ఉండగా అది రోజు రోజుకు పెరుగుతూ 50 రూపాయలకు చేరింది. నాలుగు రోజుల క్రితం అయితే టమోటాల ధర కిలో 55 రూపాయలు రైతు బజార్లో అమ్ముతున్నారు. పెరుగుతున్న టమోటాల ధరను చూసిన జనం వాటిని కొనడానికి భయపడుతున్నారు. గతంలో కేజీ రెండు కేజీలు కొన్న జనం ఇప్పుడు అర కేజీ ,కేజీ కొనడం మొదలుపెట్టారు. టమోటాలు వాడకం బాగా తగ్గించారు. టమోటాలు లేకుండా ఉండే కూరలు చేసుకోవడానికి ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు. పంట దిగుబడి తగ్గడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో కందుకూరు ప్రాంతంలోని ఓగూరు,బొంతవారిపాలెం వంటి గ్రామాలలో టమోటా సాగు చేసేవారు. అక్కడ పంట చేతికి వచ్చిన సందర్భంలో మార్కెట్లో వాటిని కిలో రెండు రూపాయల నుంచి నాలుగు రూపాయలకే కొనుగోలు చేయడంతో గిట్టుబాటు కాక టమోటా సాగును కందుకూరు ప్రాంత రైతులు మానుకున్నారు.





డిఎ కోటయ్య మృతి

ప్రజాశక్తి -ఉలవపాడు : ఉలవపాడు మండలం, టిడిపి నాయకులు, మాజీ వైస్ ఎంపిపి దాసరి అడవి కోటయ్య(డి.ఎ కోటయ్య) అనారోగ్యంతో ఆదివారం మతి చెందారు. అంబేద్కర్ నగర్లో తన స్వగహంలో గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉంటూ మతి చెందారు.కందుకూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం వారి స్వగహంలో కోటయ్య భౌతికకాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. టిడిపి నాయకులు దార్ల మల్లికార్జున, షేక్ బాజీ ,బొద్దు ప్రసాద్, మాజీ సర్పంచ్ రాములు, గోచిపాతల మోసియా, పొడపాటి సుధాకర్, దాసరి.ఎలమంద, మండల తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పొడపాటి సుధాకర్, నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, రాళ్లపాడు పరిరక్షణ సమితి నాయకులు కాకుమాని మాధవ, ఆత్మకూరు మాజీ సర్పంచ్ రాములు, తెలుగుదేశం పార్టీ నాయకులు రాచగల్లు శివ, దార్ల మల్లికార్జున, మాజీ సభ్యులు ఎస్కే బాజీ, వెలుగు మహిళా అధ్యక్షురాలు సన్యాసి విమ్మలమ్మ, బొద్దు ప్రసాద్ పాల్గొన్నారు.



గోవిందయ్యకు సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు గుడ్లూరు మండలం దారకానిపాడు వియల్ఓగా నక్క గోవిందయ్య ఉద్యోగంచేస్తు విరమణ పొందినారు. ఆదివారం కందుకూరు ఆదిత్య గ్రాండ్ ఫంక్షన్ హాల్ గోవిందయ్య పదవీ వీరమణ సన్మాన సభ జరిగింది. మిత్రులు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా ఎపియన్‌జివియఫ్ చైర్మన్ టివి రమేష్ బాబు అధ్యక్షత వహించి నిర్వహించారు. ఈ కార్యక్ర మములో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మాలకొండయ్య , వలేటివారిపాలెం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ శ్రావణి, డాక్టర్ మహమ్మద్ ఆలీ , డాక్టర్ శివరామకష్ణ ,ఎం కోటేశ్వరరావు, శంకరరావు,ఈరోజు కర్యక్రమములో చురుకుగా పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కలెక్టర్ ఆనంద్ పిలుపు

ప్రజాశక్తి-నెల్లూరు : అవయవదానం పై అపోహలు వీడి ప్రతి ఒక్కరూ అవయవదానం చేసి ప్రాణదాతలు కావాలని కలెక్టర్ ఓ. ఆనంద్ పిలుపు నిచ్చారు. జాతీయ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జీవన్ ధాన్ సంస్థ, అపోలో, మెడికవర్, కిమ్స్, నారాయణ, ఎసి ఎస్ ఆర్ హాస్పిటల్స్ (ప్రభుత్వ మెడికల్ కళాశాల) సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని వి ఆర్ సీ సెంటర్ నుంచి కస్తూరిభా కళాక్షేత్రం వరకు వాక్ థాన్ కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ కమీషనర్ ఓ నందన్, జీవన్ ధాన్ చీఫ్ ట్రాన్స్ ప్లాంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు, అపోలో హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ రంజిత్ రెడ్డి, కిమ్స్ హాస్పిటల్ సీ ఈ ఓ డాక్టర్ సతీష్, నారాయణ హాస్పిటల్ ఏ జి ఎం ఏసీ శేఖర్ రెడ్డి తదితరులతో పాటు ప్రముఖ వైద్యులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. అనంతరం కస్తూరిభా కళా క్షేత్రంలో జరిగిన అవగాహనా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అవయవదానంపై అపోహలు తొలగించి, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.అవయవ దానంతో ఎంతో మంది అమూల్య మైన ప్రాణాలు కాపాడవచ్చన్నారు. అవయవ దానం యొక్క విశిష్టతను గుర్తించి ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. తొలుత విశాఖపట్నం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ వైద్యులు రాంబాబు అవయవ దాన ప్రాధాన్యతను, అవయవ దానం చేసే ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నగర పాలక సంస్థ కమీషనర్ ఓ. నందన్,అపోలో హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ మాట్లాడారు. మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ రంజిత్ రెడ్డి,కిమ్స్ సీ ఈ ఓ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ అవయవ దానం యొక్క ప్రాధాన్యత ను గుర్తించి ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు వచ్చి ప్రాణదాతలు కావాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టరు వి.సుజాత, జి జి హెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. మాధవి, డాక్టరు రాజేశ్వరి, అపోలో హాస్పిటల్ యూనిట్ హెడ్ బాలరాజు, నారాయణ హాస్పిటల్ ఏజిఎం ఏసీ శేఖర్ రెడ్డి, అపోలో,మెడికవర్, నారాయణ, కిమ్స్, జి జి హెచ్ హాస్పిటల్ వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.




ప్రచారం చేస్తున్న దృశ్యం

ఐద్వా జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ఈనెల 5న ఇందుకూరు పేటలో జరిగే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నెల్లూరు జిల్లా 16 వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఐద్వా టిపి గూడూరు మండల అధ్యక్ష, కా ర్యదర్శులు కందిపాటి రమణమ్మ దామవరపు ఉష కోరారు. ఈ మేరకు వారు ఆదివారం తోటపల్లిగూడూరు మండలంలో కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మ య్య, సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రా జా మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సం ఘం మహిళల అభివద్ధి కోసం, హక్కుల సాధనకై జిల్లా వ్యాప్తంగా కషి చేస్తుందని తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులు గా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి, జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బీ, జిల్లా కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు టి. శివ కుమారి, ఇందుకూరుపేట మండల అధ్యక్షురాలు ఎస్. కె సల్మా పాల్గొం టారని లక్ష్మయ్య, రాజాలు తెలిపారు.

'ప్రకాశం'లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న కరస్పాండెంట్ కంచర్ల విజయ్ శ్రీనివాస్

ప్రజాశక్తి-కందుకూరు

ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజ్‌లోని పాలిటెక్నిక్ విభాగంలో డిప్లొమా ఫ్రెషర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు స్నేహపూర్వకంగా స్వాగతం పలికేందుకు రెండు, మూడో సంవత్సరం విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ "ఫ్రెషర్స్ డే అనేది విద్యార్థి జీవితంలో మరిచిపోలేని ఘట్టం. ఇది కొత్త పరిచయాలకు వేదికగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు చదువులో మెరుగవడమే కాకుండా తమ ప్రతిభను గుర్తించుకునే, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకునే అవకాశంగా ఈ రోజు ఉపయోగించుకోవాలి," అని అన్నారు. చదువుతో పాటు నైపుణ్యాలను అభివద్ధి చేసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే దిశగా నిశ్చయ బద్ధంగా ముందడుగు వేస్తున్నాం.అని స్పష్టం చేశారు. డిప్లొమా స్థాయిలోనే విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అల వరచుకోవాలని, కాలేజీ అందిస్తున్న శిక్షణ అవకాశాలను పూర్తిగా వినియో గించుకోవాలని పిలుపు నిచ్చారు.వేడుకల్లో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను అన్ని రంగాల్లో ప్రదర్శించారు. విద్యార్థుల అద్భుత నత్య ప్రదర్శనలు వేడుకకు ప్రాణం పోసినట్టు అయ్యాయి. వారు చూపిన ఉత్సాహం, ప్రతిభ, సమన్వయం ఈ వేడుకను ఘనవిజయంగా మార్చాయి.ఈ వేడుకలో పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి.హరిబాబు, అన్ని విభాగాల హెచ్ఓడిలు, బోధనా,బోధనేతర సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పెంచల్‌రెడ్డి

45 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నా..

నా పై అసత్య ప్రచారం చేస్తే ఊరుకోను..

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి నెల్లూరు నగరంలో 45 యేళ్లగా తాను వ్యాపారం చేస్తున్నాని, తనపై కొందరు వ్యక్తులు అసత్య ప్రచారం చేస్తున్నారని ఇడిబుల్ ఆయిల్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు , ప్రముఖ వ్యాపారి సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. స్టాన్‌హౌస్‌పేటతో 1979లో ఓ వ్యాపారి వద్ద చేరానని, 1986 నుంచి వ్యాపార రంగంలో ఉన్నానన్నారు. . పెద్దల సహకారంతో 45 సంవత్స రాలుగా ముందుకు వెళ్తున్నానన్నారు. 1997లో ఇడిబుల్ ఆయిల్‌తో పాటు పప్పుల వ్యాపారంలోకి వచ్చానన్నారు. ఆర్యవైశ ప్రముఖలు, పెద్దలు వ్యాపారంలో భాగస్వామ్యుల యారన్నారు. 2023 కలిసి పనిచేశానన్నారు. వర్తక వ్యాపారుల సమస్యపై నిరంతరం పనిచేస్తున్నానని, ఇటీవల తన వ్యాపారం విస్తరిం చడానికి మూడు నెలలుగా హైదరాబాద్‌లో ఉంటున్నా నన్నారు. అక్కడ ఆయిల్ వ్యాపారం ప్రారంభించానని, ఇక్కడ తమ వ్యాపారం సాగుతోందన్నారు. కొందరు వ్యక్తులు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఆ వివరాలు అంతా ఆడియో కాల్ రూపంలో తన వద్ద ఉన్నాయన్నారు. న్యాయపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తాను నెల్లూరులో అందు బాటులో ఉంటానని, తనతో ఎవరికైనా వ్యాపారాలావాదేవీలుంటే మాట్లాడకొవచ్చునన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే..

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు మండలంలోని ఓగూరు సబ్ స్టేషన్ నుంచి వెళ్లే 11 కెవి గనిగుంట ఫీడర్‌లో లైనుకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించుటకు సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం1 గంట వరకు గనిగుంట ఫీడర్ నందు విద్యుత్ సరఫరా నిలిపి చేయబడునని కందుకూరు అసిస్టెంట్ ఇంజనీర్ టివి నరసింహం తెలిపారు. ఆ ఫీడర్ పరిధిలోని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

పలుచోట్ల సుపరిపాలనలో తొలి అడుగు


కందుకూరులో..

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు ఆదేశాలతో సుపరిపాలన తొలి ఏడాది కార్యక్రమంలో భాగంగా ఏడో వార్డులో ఆదివారం తిరుగుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. వార్డు అధ్యక్షులు గౌస్ బాష, నెల్లూరు పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి రూబీ, పట్టణ మాజీ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు ఖాదర్ భాషా, నాయబ్ రసూల్ , ఖుద్దూస్, సయ్యద్ జహీర్ ఉన్నారు.

ప్రజాశక్తి - లింగసముద్రంమాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు మండలంలోని పెద్దపవని గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షులు నోటి వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీపీ పెన్నా కిష్టయ్య, కో ఆప్షన్ సభ్యులు షేక్ షఫీ,సర్పంచ్ వంటెల శ్రీనివాసులు ,వంకలపాటి వెంకటేశ్వర్లు, గారపాటి మహేంద్ర,షేక్ రసూల్,కమలాకర్ రెడ్డి,కన్నె రాజారావు,ప్రభాకర్, ఎందోటి మాల్యాద్రి, వట్టిగుంట వెంకటేశ్వర్లు,మల్లిబోయిన వెంకటేశ్వర్లు, ప్రభాకర్,జాఫర్, జానీ, ముజీర్, నజీర్,సబ్బిర్,సయ్యద్ సిరాజ్, మా భాష,షేక్ అలీ,షేక్ నాయర్ ఉన్నారు.



పెద్దపవనిలో..



విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

2024 -25 సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో ఎస్సీ బాయ్స్ హాస్టల్లో ఉండి చదువుకుని 566 మార్కులు సాధించినందుకు గానూ ఒంటేరు సాయిధనుష్ను ఆదివారం పట్టణంలోని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణయ్య, మెడికవర్ హాస్పిటల్ గుండె వ్యాధి నిపుణులు ఎం.బాలకృష్ణ డాక్టర్ జస్వంత్లు విద్యార్థి ఒంటేరు సాయిధనుష్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాన్ని పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిపిఎం మాజీ వైస్ ఛైర్మన్ షేక్ సంధాని, ఏపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్కు కృష్ణ ప్రసాద్, సాదిక్ హుస్సేన్, జన విజ్ఞాన వేదిక మండలాధ్యక్షులు ఒంటేరు మల్లికార్జున, హరికృష్ణ తదితరులు ఉన్నారు.



పింగళి వెంకయ్య జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కావలి

వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మువ్వన్నెల పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య 149వ జయంతి వేడుకలు కావలి డాక్టర్ ఎన్.ప్రభాకర్ నాయుడు హాస్పిటల్లో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా పింగళి వెంకయ్య చిత్రపటానికి పుష్పమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ ఎన్.ప్రభాకర్ నాయుడు, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్.ఖాదర్బాషా ప్రసంగించారు. కార్యక్రమంలో రత్నమ్మ ఫౌండేషన్ ఎం.వి.ఎస్.ప్రసాద రావు, వికాస్ సేవా సంస్థ రాయపాటి దిలీప్ కుమార్, వాయిస్ ఆఫ్ ముస్లిం మైనారిటీ మొఘల్ సలీమ్ బేగ్, హ్యూమన్ సేవా సంస్థ ఘని బాషా, సంయుక్త సేవా సంస్థ జి.సురేంద్ర, ఆపద్బాంధవ సేవా ట్రస్ట్ దామ మధుసూదన్ రావు, లోకసత్తా మాలకొండారెడ్డి, విద్యాంగుల నేస్తం టి సి మాల్యాద్రి నాయుడు, జాగో సంస్థ షేక్ జమీర్, బ్రెయిన్ టు హెల్ప్ సందిపాటి రమేష్, షేక్.రఫీ అహమ్మద్ ఎంపిజె, అభ్యుదయ చారిటబుల్ ట్రస్ట్ పి భాదర్ బాషా, సామాజిక సేవకులు ఎల్ఐసి ఏజెంట్ మహబూబ్ బాషా, ప్రభాకర్, దేవరకొండ విజయ్, నాగరాజు ఘంటసాల రామచంద్రయ్య, పి.ఆర్.ఒ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ కోసం నేతన్న ఎదురుచూపు..

ప్రజాశక్తి-నెల్లూరు



ఉచిత విద్యుత్పై నేతన్నలు నిరాశతో ఉన్నారని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం సహాయ కార్యదర్శి పముజుల హరి పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 80,000 కుటుంబాలకు నేతన్న నేస్తం పథకం అమలు చేయబడిందని, అలాగే 100 యూనిట్లు ఉచితమని తెలిపారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం 3 లక్షల 20 వేల కుటుంబాలకు ఉన్నాయని ప్రగల్భాలు పలికిందని తెలిపారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత 50వేల కుటుంబాలకు 200 యూనిట్లు ఉచిత పట్టుకని అమలు చేయడం చాలా ఆశ్చర్యంగా ఉందన్నారు. అదైనా ఇంట్లో మగ్గంనేసే నేతన్నలకు ఈ ఉచిత పథకాన్ని అమలు చేసే నేతన్నలు చాలా సంతోషాన్ని వ్యక్తపరుస్తారన్నారు. అలాగే 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు పరచాలన్నారు.



రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు


శ్రీ గణేష్ సేవా మిత్ర మండలి ఫౌండేషన్ 20వ వార్షికోత్సవ వేడుకల్లో ఆదివారం నోవా ఛైడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించి యువత రక్తదాన చైతన్యానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్నేహితుల దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. విశాలాక్షి వృద్ధాశ్రమంలో ఛైర్మన్ గాలి శ్రీధర్ జన్మదిన సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే జీవం ఫ్యామిలీ మెంబర్స్ మోపూరు భాస్కర నాయుడుకు మిగతా జీవీఎస్ఎం ఫ్యామిలీ సభ్యులందరికి కూడా జీవీఎస్ఎం ఫ్యామిలీ అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో కోపూరు ప్రసాద్, రాజేష్, హర్ష, శ్రీను, వినయ్, దండు సుమన్, అవినాష్ రెడ్డి, శ్రీకర్, శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ఇందుకూరుపేట



మండలం లోని నరసాపురం ఎం.వి.ఆర్.ఆర్. పాఠశాలలో మార్నింగ్ స్టార్స్ ఆధ్వర్యంలో ఆదివారం 7వ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్మార్ట్ ఫొటోగ్రఫీ వ్యవస్థాపకులు ఆంగిరు శ్యామ్ విచ్చేసి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని యువత మార్నింగ్ స్టార్స్ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడలపై యువత దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ సురేష్, నరేష్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని చిరమన గ్రామంలోని నడిబొడ్డున పోలేరమ్మ అమ్మవారి శిలా ప్రతిష్ఠ కుంభాభిషేకం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కుమార్తె ఆనం లీలాకైవల్యా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలేరమ్మ అమ్మవారి ప్రాచీనత, గ్రామ దేవతగా ఆమెకు ఉండే విశిష్టత గ్రామ అభివృద్ధిలో ఆధ్యాత్మికతకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామానికి శాంతి, సమృద్ధి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిరమన సీనియర్ నాయకులు కాటంరెడ్డి రవీంద్రా రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు నరసింహారెడ్డి, కార్య నిర్వాహకులుగా వ్యవహరించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన గ్రామస్తులకు, సహకరించిన ప్రజాప్రతినిధులకు, ఆనం కైవల్యారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

స్మార్ట్‌మీటర్ల బిగింపును అడ్డుకోవాలి


మర్రిపాడులో..

ప్రజాశక్తి మర్రిపాడు

అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించకుండా ప్రజలు అడ్డుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ ఉపకేంద్రం వద్ద వామపక్షాల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు మూలి వెంగయ్య పాల్గొని మాట్లాడుతూ ఇళ్లలో కరెంటు మీటర్ తొలగించి అదానీ కంపెనీ వారు స్మార్ట్ మీటర్‌ను బిగించడానికి వస్తున్న విద్యుత్ అధికారులను వ్యతిరేకించాలన్నారు. మొదట ప్రభుత్వ కార్యాలయాలకు, తదుపరి వ్యాపార సంస్థలకు షాపులకు మీటర్లు బిగించారు. ఇంటి యజమానుల అనుమతి లేకుండా మోసపు మాటలు చెప్పి బెదిరించి ఇంటిమీటర్లు మారుస్తున్నారు. అదానీ స్మార్ట్ మీటర్ వల్ల శాశ్వతంగా ప్రజలపై విపరీతమైన భారాలు పడతాయని, క్రమంగా విద్యుత్ పంపిణీ కూడా అదానీ లాంటి బడా కంపెనీలు చేతిలోకి వెళ్లబోతుందని స్మార్ట్ మీటర్ల వలన కలిగే నష్టాలు ప్రమాదాలను గుర్తించి ఆదిలోనే అడ్డుకోవాలని కోరారు. స్మార్ట్ మీటరుకు సెల్‌ఫోన్ పద్ధతిలో ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాలన్నారు. ఇంటికి వచ్చి రీడింగ్ తియ్యరు బిల్లు ఇవ్వరు, ఆన్‌లైన్లోనే అదానీ కంపెనీ రీడింగ్ చూస్తుందన్నారు. మన డబ్బు రోజు కట్ చేసుకుంటారని తెలిపారు. డబ్బులు అయిపోతుండగా ముందు మెసేజ్ పెడతారన్నారు. రీఛార్జ్ చేయించుకోవాలి లేకపోతే కరెంటు ఆగిపోతుందన్నారు. ఇప్పట్లాగా 15 రోజులు నెల రోజులు ఆగి కట్టే అవకాశం లేకుండా పోతుందని తెలిపారు. ముందే పెట్టుబడి పెట్టాలన్నారు. ఏనాడు లేని విధంగా అధిక కరెంటు వాడే సమయంలో రాత్రి 6 గంటల నుండి 10 గంటల వరకు అధిక రేట్లు వసూలు చేస్తారని తెలిపారు. అంటే పగలు ఒకరేటు.. రాత్రి ఒక రేటు.. ఎప్పుడు పడితే అప్పుడు రేట్లు పెంచవచ్చన్నారు. సింగిల్ ఫేస్ మీటర్‌కు రూ.8927, త్రీఫేస్‌మీటర్ రూ.17286లు 93 నెలల్లో మీటర్ అద్దె పేరుతో మన నుండి నెలవారీ వాయిదాలలో వసూలు చేస్తారన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్లు బిగింపుకు ఆదానీ కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారని, దానివల్ల ప్రజలపై సుమారు రూ.25వేలకోట్ల భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌డి రహంతుల్లా, సిఐటియు మండల కార్యదర్శి రత్నయ్య, ఐద్వా మహిళా నాయకురాలు శ్యామలమ్మ పోలిరెడ్డి, గంగినేని తిరుపతి, హాజరతయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బిట్రగుంటలో..

ప్రజాశక్తి-బిట్రగుంట : అదానీ విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్‌ను బిగించకుండా ప్రతిఒక్కరూ అడ్డుపడాలని మండల సిపిఎం సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లపై ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆదివారం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట చిన్నబజార్ లోని దుకాణదారులకు, విశ్వనాథరావుపేటలోని ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బోగోలు మండల సిపిఎం సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదాని గ్రూప్ కంపెనీలకు కొమ్ముకాస్తూ ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతుందని తెలిపారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లతో ప్రజలపై వేసే భారాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. ఇప్పటికే ప్రజలపై విద్యుత్ భారం వేసి ప్రజల్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని తెలిపారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా విద్యుత్ కేంద్రాల వద్ద సబ్ స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శ బాదుల్లా, కడనూతల శాఖ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు, మండల సిఐటియు కార్యదర్శి చల్ల నరహరి, సిఐటియు ఉపాధ్యక్షుడు ఎస్.కె.అన్వర్‌బాషా, విశ్వనాథరావుపేట శాఖ కార్యదర్శి ఎస్ రామయ్య, సిపిఎం నాయకులు, సిఐటియు కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


బుచ్చిలో..

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ 3 రోజులపాటు ప్రతి ఊరిలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు సిపిఎం నాయకులు తెలిపారు. బుచ్చిరెడ్డిపాలెం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం కాగులపాడు పంచాయతీ శ్రీరంగ రాజపురం గ్రామం నుంచి ఆటో ప్రచారం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఆదానితో ఒప్పందం కుదుర్చుకొని వ్యవసాయ అవసరాలకు గానూ ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లు బిగించాడాన్ని వ్యతిరేకిస్తూ బుచ్చిరెడ్డిపాలెం, సంఘం మండలాల్లో ఆటో ప్రచారాలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం నాయకులు తెలిపారు. స్మార్ట్ మీటర్లు, పెరిగిన విద్యుత్ ఛార్జీలపై బుచ్చి, సంఘం సబ్ స్టేషన్‌ల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గరికపాటి సురేష్, పుత్తేటి మల్లికార్జున, కోరికల సతీష్, విస్సా మునిస్వామి, మద్దిశెట్టి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



సుంకర అంజమ్మ నేత్రదానం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం రాజీవ్ నగర్‌లోని పట్టణ వైసీపీ నాయకులు సుంకర దయాకర్ రెడ్డి తల్లి సుంకర అంజమ్మ (82) వృద్ధాప్యంతో మరణించగా, ఆమె చివరి కోరిక మేరకు ఆమె నేత్రాలను కావలి రెడ్‌క్రాస్ సహకారంతో దానం చేశారు. ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ సునీల్ ఆమె కార్నియాలను సేకరించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, తమ తల్లి నేత్ర, అవయవ దానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండేదని, 20 సంవత్సరాల క్రితమే కావలి రెడ్‌క్రాస్‌కు నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాన్ని అందజేసిందని పేర్కొన్నారు. కాగా అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం రోజున నేత్రదానం చేసే అవకాశం ఆమెకు లభించిందని, ఆమె మరణానంతరం మరో ఇద్దరు కార్నియా అంధులకు చూపు కల్పించడం తమకు సంతోషం కలిగిస్తుందని వివరించారు. జిల్లా రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ గాదిరెడ్డి హరనాథ్ దయాకర్ రెడ్డికి ప్రశంసాపత్రాన్ని బహుకరించారు. ఇది కావలి రెడ్ క్రాస్ ద్వారా జరిగిన 142వ నేత్రదానమని వారు తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం ఇన్‌ఛార్జి ఇలింద్ర శ్రీవాణి, దయాకర్ రెడ్డి కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు నేత్రదాత సుంకర అంజమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు.


మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

భగవంత్ కేసరి చిత్రానికి జాతీయ అవార్డుపై సంబరాలు

ప్రజాశక్తి-నెల్లూరు నగరం

ప్రముఖ కథానాయకుడు, హిందూపురం ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి చలన చిత్రానికి జాతీయ అవార్డు లభించడంతో, అభిమానులు సంబరాలు నిర్వహించారు. తొలుత స్థానిక నర్తకి సెంటర్లోని నందమూరి రామారావు విగ్రహానికి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పూలమాలవేసి సంబరాలు నిర్వహించారు. నందమూరి బాలకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం సంబరాలు వైభవంగా నిర్వహించారు. తొలుత ఆ సెంటర్‌లో బాణాసంచా పేల్చి, జై బాలయ్య అంటూ నినాదాలతో అభిమానులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం శ్రీనివాసులు రెడ్డి అభిమానులకు మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ దైవం నందమూరి బాలకృష్ణ అని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అటువంటి ఆయన చిత్రానికి జాతీయ అవార్డులు రావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఆయన చిత్ర పరిశ్రమలోనే కాక, సేవా దృక్పథంతో క్యాన్సర్ హాస్పిటల్ రాష్ట్రంలో ప్రజల కోసం ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో అభిమానులు, 48వ డివిజన్ అధ్యక్షులు వేలూరు పెంచలబాబు, డివిజన్ కోఆర్డినేటర్ కృష్ణమనేని నవీన్, పోలిచర్ల సీనయ్య, కోటగిరి వీరశేఖర, జాఫర్ పలు డివిజన్ల టిడిపి శాఖా కార్యదర్శులు, అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 5.30గంటలకు హాస్పిటల్ మూసి ఉన్నారు ఏమిటని ప్రజాశక్తిలో వేసిన వార్తకు జిల్లా వైద్యాధికారి డిఎంహెచ్ఒ స్పందించారు. స్టాఫ్ తక్కువగా ఉండటం వల్ల ఈ పరిస్థితి నెలకొందని ఒక వారంలో 24 గంటల సేవలు అదించేందుకు ప్రయత్నాలు చేస్తామని పత్రికా ముఖంగా తెలియజేశారు.



చిన్నారికి ఎంఎల్ఎ ఆశీర్వాదం

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కప్పరాళ్ళతిప్పకు చెందిన చల్లా శ్రీకాంత్ - ప్రియాంక దంపతుల కుమారుడు హిమాన్స్ మొదటి జన్మదిన వేడుకలు శనివారం రాత్రి వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. జన్మదిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మొక్కలను పంచారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

5న కరెంటు ఆఫీసు ఎదుట ధర్నా

జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల పిలుపు

ప్రజాశక్తి-కావలి

స్థానిక కరెంట్ ఆఫీసు ఎదుట 5వ తేదీన వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరుగనున్న విద్యుత్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆదివారం వామపక్ష పార్టీల నాయకులు పిలుపు నిచ్చారు. ఈ పిలుపు మేరకు స్మార్ట్ మీటర్లను ఇళ్ళకు బిగించ వద్దని ఆదివారం పుల్లారెడ్డి నగర్‌లోని రెసిడెన్షియల్ శ్రీనిలయం, కెఆర్ఎస్ గోల్డ్ హోమ్స్, ఇంకా మరికొన్ని అపార్ట్‌మెంట్లలో వామపక్ష పార్టీల నాయకులు స్మార్ట్ మీటర్ల వల్ల వచ్చే ఇబ్బందులను వివరిస్తూ స్మార్ట్ మీటర్ల విధానాన్ని ప్రజలు వ్యతిరేకించాలని ప్రచారం గావించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, సిపిఐ నాయకులు డి.దర్గా బాబు, సిపిఐ ఎంఎల్ నాయకులు ఎల్.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల విధానం తీసుకుని వచ్చిఇళ్లకు, షాపులకు, అపార్ట్‌మెంట్లకు బిగించి ప్రజల వద్ద నుండి కరెంటు ఛార్జీల పేరుతో ఎక్కువ డబ్బులు గుంజి, ఆదానికి లాభాలు చేకూర్చే పనిలో ఉన్నారన్నారు. ఈ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై వేల రూపాయలు భారం పడుతుందని, ఇప్పటికే కరెంటు ఛార్జీల భారం ప్రజలపై రూ.16 వేలకోట్లు పడిందన్నారు. పెరిగిన కరెంటు బిల్లులు కట్ట లేక ప్రజలు సతమతమవుతున్నారన్నారు. ఇప్పుడు మళ్లీ స్మార్ట్ మీటర్ల విధానం తీసుకొచ్చి, ప్రభుత్వం ప్రజలపై భారాలపై భారాలు మోపడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను, ట్రూఅప్ కరెంటు ఛార్జీలను వ్యతిరేకించిన ప్రస్తుత ప్రభుత్వ నాయకులు ఇప్పుడు గత ప్రభుత్వ విధానాలను అమలు చేయడం ఏమిటని, కరెంటు ఛార్జీలను పెంచబోమని గతంలో చెప్పిన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానం అమలు చేయకుండా మంచి పరిపాలన అని చెబుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించే విధా నాన్ని మానుకోవాలని ట్రూఅప్ సర్దుబాటు ఛార్జీల పేరుతో పెంచిన కరెంటు ఛార్జీలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు మోపితే పోరాటాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.మధు సూదనరావు, సిపిఐ నాయకులు నరసింహం, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు


మాట్లాడుతున్న సిఐ వెంకట్రావు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

పోలీస్ సర్కిల్ పరిధిలోని ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిఐ వెంకట్రావు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆటో డ్రైవర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆటోవాలాలు వాహనానికి సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్ పొల్యూషన్ తదితర పత్రాలను తప్పనిసరిగా ఆటోలో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి ఆటో వాహనాలు కండిషన్‌లతో ఉండాలని సామర్థ్యాన్ని మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. ఆటోలలో ఎక్కే ప్రయాణికులపై మర్యాదగా వ్యవహరించాలన్నారు. నిబంధనను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చదివించారు.

కండలేరు కాలువకు నీరు విడుదల

ప్రజాశక్తి-అనంతసాగరం



సోమశిల ప్రాజెక్టు నుంచి కండలేరు వరద కాలువకు 3వేల క్యూసెక్కుల నీటిని సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవ చౌదరి, సోమశిల ప్రాజెక్టు ఎస్ఇబి వెంకట రమణారెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.శ్రీనివాస్ కుమార్ నీటిని విడుదల చేశారు. తొలిత గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవ చౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రెండు రికార్డులు సాధించామని గర్వంగా ఉందని నియోజకవర్గం శాసనసభ్యులు, రాష్ట్ర ధర్మాదాయ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనలతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించామన్నారు. ఎన్నడూ లేని విధంగా ఆగస్టు 3న సోమశిల జలాశయం నుంచి కండలేరు వరద కాలువకు నీటిని విడుదల చేసిన ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన ఈ రెండు రికార్డులు సాధించడంపై ప్రాజెక్ట్ చైర్మన్గా తనకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కలవాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేష్, తెలుగు గంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్ కుమార్ రెడ్డి, సోమశిల ప్రాజెక్టు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర ప్రసాద్, ఉత్తర కాలువ నీటి సంఘం అధ్యక్షులు డి పెంచల ప్రసాద్ నాయుడు, తెలుగు దేశం నాయకులు జంజం నారాయణ, సాంబయ్య నాయుడు, ఉదయగిరి శ్రీకాంత్, జేఈలు పాపిశెట్టి నిఖిల్, పెద్దిరాజు, ఆంధ్రప్రదేశ్ వర్క్ చార్జ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పలపాటి రామయ్య, ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, ప్రాజెక్టు సిబ్బంది గుడిపాటి రవి, గుమ్మడి రాజా, పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ప్రజాశక్తి-వింజమూరు

వింజమూరులోని ఎర్రబల్లిపాలెంలో వెలసియున్న గ్రామ దేవత పోలేరమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి పొంగళ్ళు ఎడ్ల బండ్లు తిరిగే కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు అభిషేకాలు జరిగాయి. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు భక్తులందరికీ తీర్థప్రసాదాలు వినియోగించారు. కార్యక్రమంలో భక్తులు ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.



భోగినేని కాశీరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సీతారాంపురం

మండల పరిధిలోని స్థానిక బస్టాండ్ నందు జనసేన నాయకుడు భోగినేని కాశీ రావు జన్మదిన వేడుకలు ఆదివారం టిడిపి జనసేన నాయకులు మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం కేకు కట్ చేసి కాశీ రావుకు హార్ధిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి తన వంతు కృషి ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని గ్రామాభివృద్ధికి తన సహాయం అందిస్తామన్నారు. టిడిపి కార్యకర్తలు మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం కొన్ని కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయడం కూడా జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆర్థిక సహాయం చేయడానికి కాశీరావు ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-సంగం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి పద్మావతమ్మ అధ్యక్షతన ఎంపిడిఒ షాలెట్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి ఇందిరమ్మ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు. మండలంలో జరిగిన అభివృద్ధిపై అధికారులు శాఖల వారీగా సమావేశంలో వివరించారు. పలు శాఖల అధికారులు ఈ సమావేశానికి గైర్హాజరవడంతో సభ్యులు సమావేశంలో లేవనెత్తారు. గ్రామాలలో పలు సమస్యలపై సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని వారికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమాజంలో గురువులకు అత్యున్నత గౌరవం

ప్రజాశక్తి-కావలి

సమాజంలో అత్యున్నత గౌరవం గురువుల సొంతమని, కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం కావలి పెన్షనర్స్ భవనంలో బిటిఎ 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి హాజరైనారు. బిటిఎ సంఘం, ఉపాధ్యాయుల గొప్పతనాన్ని చక్కగా వివరించారు. ఉపాధ్యాయులైన వారు జీవితానికి అంకురం వంటి వారన్నారు. విద్యార్థుల జీవితాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దగలవారని కొనియాడారు. గత ప్రభుత్వంలో టీచర్లు జీతాల కోసం ఎదురు చూసేవారని, నేడు 1వ తేదీనే జీతాలు అందుకుంటున్నారని తెలిపారు. టీచర్లకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యా శాఖమంత్రి లోకేష్, నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ, బిటిఎ సంఘం రాష్ట్రంలో బలమైన సంఘంగా అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లోనూ, తెలంగాణ లో కూడా బిటిఎ సంఘం ఒక మహాశక్తిగా ఎదుగుతుందని తెలిపారు. ఒక మహిళను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన ఘనత ఒక బహుజన టీచర్ అసోసియేషన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అనేక జిల్లాలలో సంఘం బలోపేతానికి రాష్ట్ర శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని అదేవిధంగా బిటిఎ సంఘం ఆవిర్భవించిన నెల్లూరు జిల్లా సంఘానికి తలమానికంగా పనిచేస్తుందని కొనియాడారు. జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు మాట్లాడుతూ నేటికీ జిల్లాలోని 36 మండలాల్లో క్యాంపెయిన్ నిర్వహించి సభ్యత్వ నమోదు నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధికి రాష్ట్ర శాఖ సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు తెలిపారు. రాష్ట్ర నాయకులు విధిగా సంఘ సభ్యత్వ కార్యక్రమాల్లో, మండల కార్యాలయంలో విధిగా పాల్గొని జిల్లాని ముందు వరుసగా ఉంచాలని, అన్ని మండలాల్లో కాంపెయిన్ నిర్వహించి సత్తా చాటే విధంగా రాష్ట్ర నాయకత్వం మార్గదర్శనం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అనేకమంది రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులను, రాష్ట్ర నాయకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పల్లం వేణుగోపాల్, రాష్ట్రకోశాధికారి పి.ఆదినారాయణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముసలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు వరుసగా మనోజ్ కుమార్, పి లక్ష్మయ్య, కట్టా రమేష్, ఎం.భాస్కర్, వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు జిల్లా నాయకులు, జిల్లాలోని అన్ని డివిజన్లోని సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి